విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

బుధవారం 04 సెప్టెంబర్ 2024 8 పేజీలు

గండం గడిచేదెలా..!

- వరద ముంపులోనే లంక గ్రామాలు
- ముంపు గ్రామాల్లోనే 24 వేల మంది జనాభా
- మంత్రులు అనగాని, గొట్టిపాటి, ఎంపీ తెన్నేటి, ఎమ్మెల్యే ఆనందబాబు పర్యటన
- సహాయ చర్యలు ముమ్మరం చేసిన కలెక్టర్ వెంకటమురళి
- ఎస్పీ తుషార్‌డూడీ నేతృత్వంలో నిరంతరం గస్తీ, సాయం

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : ఎటు చూసిన కనుచూపు మేర నీరు బయటకు అడుగు పెడదామంటే భయంతో ఆందోళనలో ఉన్న లంక గ్రామాల ప్రజలు గండం గడిచేదెలా అంటూ దీనస్థితిలో ఉన్నారు. కృష్ణానదికి వరద నీరు గతంలో ఎన్నడూ లేని విధంగా పోటెత్తటంతో 20 గ్రామలు వరద ముంపుకు గురైయ్యాయి. దీంతో 4 వేల గృహాలు వరద నీటిలో ఉన్నాయి. సుమారు 13 వేల మంది జనభా ముంపు గ్రామల్లో నివాసం ఉంటున్నారు. రెవిన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్తు శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిస్థితులను ఎప్పుడికప్పుడు ఆరా తీస్తూ సహాయ చర్యలు ఏ ఆటంకం లేకుండా పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ వెంకటమురళి నిత్యం అధికార యంత్రాగాన్ని అప్రమత్తం చేస్తూ చేపట్టాల్సిన సహాయ చర్యలపై దిశానిర్ధేశం చేస్తున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు సైతం తీసుకుంటున్నారు. ఇప్పటికే నలుగురు అధికారులను సస్పెండ్ చేశారు. ఎస్పీ తుషార్‌డూడీ నేతృత్వంలో సుమారు 400 మంది పోలీసులు ముంపు ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు ప్రజలు అప్రమత్తం చేస్తూ సహాయ చర్యల్లో పాల్గొంటున్నారు. వరద ముంపు దాటికి ప్రాణ నష్టం జరగకుండా నిరంతరం అధికార ప్రభుత్వ యంత్రాంగం పని చేస్తున్నారు.

- జలదిగ్బంధంలో చిక్కుకుపోయిన లంక గ్రామాలలోని ప్రజలకు కొల్లూరు లాక్‌ల వద్ద నుంచి 40 బోట్ల ద్వారా భోజనం, తాగునీరు, ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్న ప్రక్రియను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, శాసనసభ్యులు నక్కా ఆనందబాబు మంగళవారం పరిశీలించారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం

మంత్రులు గొట్టిపాటి, అనగాని

విశాలాంధ్ర - రేపల్లె : లోతట్టు వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ వరద బాధితులకు భరోసా, ధైర్యం కల్పించారు. మంగళవారం రేపల్లె మండలం పెనుమూడి పల్లెపాలెం గ్రామాల వరద బాధిత కుటుంబాలను స్థానిక మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలను మంత్రులు పరిశీలించి వారికి ధైర్యం భరోసా ఇచ్చారు. అకాల వర్షం వలన వరద ఉద్ధృతికి నీట మునిగిన పల్లిపాలెం మత్స్యకారుల కుటుంబాలకు మంత్రులు భరోసా కల్పించారు. అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ 10 లక్షల క్యూసెక్కుల వరదలు కూడా గతంలో చూసిన లంక గ్రామాల ప్రజలు ప్రస్తుతం వచ్చిన 11.5 లక్షల క్యూసెక్కుల ప్రకాశం బ్యారేజీ ప్రవాహాన్ని శతాబ్ద కాలంలో ఎప్పుడు చూడలేదని ఈ స్థాయిలో వరద ఉధృతి ప్రభుత్వం ఊహించలేదని, లంక గ్రామాల ప్రజలు, అన్ని శాఖల అధికారులు, సమన్వయంతో పనిచేయడం వల్ల విపత్తు నుండి బయటపడ గలిగామన్నారు. కరకట్టల పటిష్టతకు గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, కరకట్టల సమీపంలో గతంలో యథేచ్ఛగా ఇసుక, మట్టి తవ్వకాలు చేయటం వలన ముంపు పెరిగిందన్నారు.

బాధితులకు బాసటగా..

ప్రకాశం జిల్లా నుండి విజయవాడకు సుమారు లక్షా 20 వేల ఆహార ప్యాకెట్లు దాతల సహకారంతో అధికారులు తరలించారు. మంగళవారం ఏ 1 కన్వెన్షన్ సెంటర్, బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో ఆహార పాకెట్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా.

-విశాలాంధ్ర, ఒంగోలు :

విజయవాడ వరద ముంపు బాధితులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో 45వేల ఆహార పొట్లాలను తరలించేందుకు మంగళవారం ఏర్పాట్లు చేస్తున్న సహాయకులు.

-విశాలాంధ్ర, మార్టూరు

అధికారుల బదిలీలలో
కాసుల వర్షం

- సిఫార్సు లేనిదే పోస్టింగ్ లేదు
- సిఫార్సు లెటర్ల కోసం ప్రదిక్షణలు
- పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు ఇదే తంతు
- బదిలీల్లో చక్రం తిప్పుతున్న ఎమ్మెల్యేలు
- పలువురి ఎమ్మెల్యేలపై విమర్శలు



విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : రాష్ట్ర వ్యాప్తంగా వరదలు పోటెత్తుతున్నాయి. మరోపక్క అధికారుల బదిలీల్లో శాసనసభ్యులు మునిగితేలుతున్నారు. అధికారులు కోరుకున్న స్థానం కావాలంటే కాసులవర్షం కురిపించాల్సిందే. అధికారుల బదిలీల్లో తప్పనిసరిగా ఎమ్మెల్యేల సిఫార్సు లెటర్లు అనివార్యమైంది. దీంతో పంచాయతీ సెక్రటరీ దగ్గర నుంచి జిల్లా పంచాయితీ అధికారి డీపీఓ దగ్గర వరకు ఎమ్మెల్యేల సిఫార్సు లెటర్లతో పాటు కాసులవర్షం కూడా కురిపించాల్సిన పరిస్థితి జిల్లాలో ఏర్పడింది. అధికార బదిలీల్లో కొంతమంది ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఈ నెల 15వ తేది వరకు అధికారుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 నియోజకవర్గాలకు గాను దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాలు మినహాయిస్తే మిగిలిన 10 నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన అభ్యర్దులు విజయం సాధించారు. ఇక దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలుగా ఉన్న గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబులు ఇన్‌ఛార్జిలుగా వ్యవహరిస్తున్నారు. ఎలక్షన్ ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో గ్రామస్థాయి అధికారి నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు బదిలీలు అనివార్యంగా జరగనుంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఎస్పితో పాటు ఒంగోలు కమిషనర్, డీఎస్పి, సీఐ, ఎస్ఐల బదిలీలు ముగిశాయి. ఇక జిల్లాస్థాయి వివిధ శాఖల అధికారులు, మండలస్థాయి అధికారులతో పాటు గ్రామ పంచాయితీ అధికారుల వరకు బదిలీలు జరగనున్నాయి. ఈ బదిలీల ప్రక్రియలో ఎమ్మెల్యే లేదా ఎంపీ సిఫార్సు లెటర్లు ఉంటేనే వారికి పోస్టింగ్ ఉంటుంది. అధికారులు వారు పనిచేస్తున్న స్థానం నుంచి వారు కోరకున్న మరో స్థానానికి పోస్టింగ్ పడాలంటే కాసుల వర్షం కూడా కురిపించాల్సిందే. సిఫార్సు లెటర్లతో పాటు లక్షల్లో కొత్తగా ఎన్నికైనా ఎమ్మెల్యేల తరపున కొంతమంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలోని ఒకరిద్దరు ఎమ్మెల్యేలు లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అయితే తెలుగుదేశం పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేలు, సంబంధిత మంత్రులు కూడా పారదర్శకమైన పాలన అందించాలని ఎవరిపైనైనా అవినీతి ఆరోపణలు వస్తే సహించేది లేదని క్లారిటీగా చెప్పారు. అయినప్పటికీ జిల్లాలోని కొంతమంది ఎమ్మెల్యేల ఆఫీసు నుంచి బదిలీల సిఫార్సు లెటర్ కానీ లేదా నామినేటెడ్ పోస్టులకు సంబంధించి రికమెండేషన్ లెటర్‌కు లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వరదల ప్రభావం జిల్లాపై లేకపోవడంతో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు అధికారులు బదిలీలపై దృష్టి సారించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలపై ఇప్పుడిప్పుడే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

సహాయక చర్యల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు

- నలుగురు అధికారులు సస్పెండ్
- జిల్లా కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : లంక గ్రామాల్లో వరద ముంపులో బాధితులకు సహాయ చర్యలు అందించే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే నలుగురు అధికారులను సస్పెండ్ చేశామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి హెచ్చరించారు. వరద ప్రవాహం తగ్గిన తర్వాత లంక గ్రామాలలో సహాయక చర్యలపై అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. వరద ముంపు తదుపరి చర్యలపై జిల్లా అధికారులతో మంగళవారం స్థానిక కొల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ముందుగా టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు, వరదతో దెబ్బతిన్న ప్రాంతాలలో అధికారులు పర్యటించాలని కలెక్టర్ చెప్పారు. లంక గ్రామాలలోని ప్రతి వ్యక్తికి ఆహార పదార్థాలు అందేలా చూడాలన్నారు. భోజన పదార్థాల అందించడంలో ఇబ్బందులు ఎదురైతే పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. భోజనం అందలేదనే ఫిర్యాదులు ఏట్టి పరిస్థితుల్లో రాకూడదన్నారు. సహాయక చర్యలపై డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. వైద్య శిబిరాలలో సిబ్బంది సంఖ్యను పెంచాల నున్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు శరవేగంగా చేపట్టాలన్నారు. రోగాలు ప్రబలకుండా ముఖ్యంగా బ్లీచింగ్ చల్లాలన్నారు. దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు చర్యలు చేపకోవాలన్నారు. విద్యుత్ పునరుద్ధరణపై విద్యుత్ శాఖ అధికారులు దృష్టి సారించాలన్నారు. దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన వన పంటలు గుర్తించాలన్నారు. పంటల నష్టంపై సర్వే చేపట్టాలని ఆదేశించారు. అనధికారికంగా లంక గ్రామాలలోకి ప్రజలు ప్రవేశించడాన్ని అరికట్టాలన్నారు. ఔషధాలకు కొరత లేకుండా నిల్వలు ఉంచాలని, వైద్యంలో జాప్యం చేయరాదన్నారు. రాత్రి నుంచే తగ్గుముఖం పట్టగా తెల్లవారుజామున మూడు గంటల సమయానికి వరద నీరు మూడు అడుగుల మేర దిగువకు తగ్గిందన్నారు. తదుపరి వరద ప్రవాహం తగ్గుతూ ఉందన్నారు. సహాయక చర్యలలో ఎలాంటి ఆరోపణలు రాకుండా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లోనే బాధితులు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : వరద ముంపులోనే ఇంకా బాధితులు అల్లాడుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. ఆయా ప్రాంతాలకు వెళ్తున్న ఆహార పదార్థాల వివరాలను ప్రజాప్రతినిధులు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద పరిస్థితిపై అన్ని శాఖల అధికారులతో స్థానిక ఎండిఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.

- కరకట్ట బలహీనపడిన ప్రాంతాలను పరిశీలించి కరకట్ట బలోపేతం చేయాలని మంత్రి రవికుమార్ తెలిపారు. లంక గ్రామాలలో విద్యుత్ పునరుద్ధరణకు సిపిడిసిఎల్, ఎస్పీడీసీఎల్ నుంచి 1000 మంది లైన్మెన్లను పంపుతామన్నారు. లంక గ్రామాల కొరకు 1000 సోలార్ ల్యాంప్ లు ఇస్తామన్నారు. రెండు విద్యుత్ సబ్ స్టేషన్లు దెబ్బతిన్నాయన్నారు. బోట్లు ప్రయాణిస్తున్నందున విద్యుత్ నిలిపివేసి జనరేటర్ల ద్వారా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. బోట్లలో వెళ్లే వారికి తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

- వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో మరో 48 గంటలపాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. లంక గ్రామాలలోని ప్రజలకు తాగునీరు, వైద్యం, భోజనం సకాలంలో అందించాలని అనారోగ్యానికి గురికాకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు శరవేగంగా చేపట్టాలన్నారు. 24 వేల మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజనం అందించడం సాహసోపేతమైన చర్యగా అభివర్ణించారు. గత మూడు రోజులుగా రెవెన్యూ, పోలీసులు 24 గంటల పాటు పనిచేస్తున్నారని ప్రత్యేకంగా అభినందించారు. కరకట్టకు అనధికారికంగా 65 పైపులైన్లు కొందరు వేయడంతో ఆ ప్రాంతంలో కరకట్ట బలహీన పడిందన్నారు.

- కృష్ణానది వరద ఉధృతి 8.64 లక్షల క్యూసెక్కులకు తగ్గడంతో ప్రమాదం కొంతమేరకు తగ్గినట్లేనని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. చరిత్రలో ఎన్నడు లేనంతగా కృష్ణానది వరద ప్రవాహం 11.50 లక్షల క్యూసెక్కులకు చేరడంతో 24 హ్యాబిటేషన్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయన్నారు. అందులో 24 వేలమంది లంక గ్రామాలలోనే ఉండిపోయారని తెలిపారు. జనరేటర్లు ఏర్పాటు చేసి 750 విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. వారికి ఆహార పదార్థాలు అందించడానికి 40 మర బోట్లు నడుపుతున్నామని, 200 లైఫ్ జాకెట్లు కొనుగోలు చేసే సిద్ధంగా ఉంచామన్నారు. 65 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు రోజుకి మూడు పర్యాయాలు బాపట్ల జిల్లా పరిస్థితులపై ఫోన్ లో మాట్లాడుతున్నారని అధికారుల పనితీరుపై సీఎం ప్రశంసించారని తెలిపారు. నీట మునిగిన గృహాలు, జలవిగ్బంధంలో చిక్కుకున్న కుటుంబాలకు 25 కేజీల బియ్యం, నూనె ఒక లీటర్ ప్యాకెట్, కందిపప్పు ఒక కిలో, పంచదార ఒక కిలో, బంగాళదుంపలు ఒక కిలో, ఉల్లిపాయలు ఒక కిలో, చేనేతలు మత్స్యకారులు ఉంటే ఆ కుటుంబాలకు 50 కిలోల బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. లంక గ్రామాలలో 8,600 కుటుంబాలు ఉన్నాయని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. ప్రస్తుతం 9 వేల కుటుంబాలకు సరిపడా సరుకులు సిద్ధంగా ఉంచామన్నారు. 24 వైద్య శిబిరాలు లంక గ్రామాలలో కొనసాగుతున్నాయన్నారు. లంక గ్రామాలలోని పశువుల కొరకు ఇప్పటికే 95 మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందించామని, అదనంగా 400 మెట్రిక్ టన్నులు పశుగ్రాసం తెప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

చిట్టచివరి బాధితుడికీ ప్రభుత్వ సాయం అందిస్తాం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

విశాలాంధ్ర -ఒంగోలు : వరద ముంపుతో వరదల్లో చిక్కుకున్న విజయవాడ నగరంలో చిట్టచివరి బాధితుడికి కూడా ప్రభుత్వ సాయం అందిస్తామని, అదే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మంగళవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో భవానిపురం, హౌసింగ్ బోర్డు కాలనీ లలో క్షేత్రస్థాయిలో విజయవాడలో వరద పరిస్థితి ని ఎమ్మెల్యే జనార్దన్ పర్యవేక్షించారు. స్థానిక 42 మరియు 40వ డివిజన్లు ఇన్‌ఛార్జిగా దామచర్ల జనార్దన్ రావు ని సీఎం చంద్రబాబు నియమించారు. ఈ మేరకు విజయవాడ 42, 40 డివిజన్‌లోని విస్తృతంగా పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు దామచర్ల. ఒంగోలు నుండి తీసుకోవచ్చిన 30వేల పులిహోర బాక్స్ లు, 20 వేల వాటర్ బాటిల్స్, 15 వేల బిస్కెట్ పాకెట్స్ ను బాధితులకు అందజేయడం జరిగినది. వరద నీటిలో చిక్కుకున్న కుటుంబాలకు ఆహార పొట్లాలు స్వయంగా అందేలా సమన్వయం చేస్తున్నారు. వరద బాధితులకు ఆహారం, తాగునీటి ప్యాకెట్లు అందుతున్న తీరుపై స్వయంగా పర్యవేక్షించారు. వరద బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, స్థానిక టీడీపీ ఇంచార్జి బేగ్ గారు, భవానీపురం మాజీ కార్పొరేటర్ యెదుపాటి రామయ్య, టీవీ శ్రీరామ్ మూర్తి, కొరాది నాగేశ్వరావు, సింగరాజు రాంబాబు, కామేపల్లి శ్రీనివాసరావు, బందారు మదన్, మేడికొండ మోహన్ తదితరులు పాల్గొనడం జరిగినది.

పూరిల్లు దగ్ధం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలోని మాదిగపల్లెలో కాటూరి యోహోనుకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ప్రమాదంలోని ఇంటిలోని సామానుతోపాటు ఇంటిలోని రూ.50వేల నగదు కూడా కాలిపోయింది. దీంతో ఆయన కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో రోడ్డుపై నిలిచారు. ఘటనా స్థలాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు తెల్ల మనోజ్ పరిశీలించారు. బాధితులను పరామర్శించి తక్షణ సాయం చేశాడు. ప్రభుత్వం నుంచి తోడ్పాటు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ

విశాలాంధ్ర-సీఎస్‌పురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి అలహరి మహేంద్రనాయుడు పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి తాను చదువుకున్న పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులకు సుమారు 50 వేల విలువగల ప్యాడ్‌లు, పెన్సిళ్లు, పెన్నులు, చాక్లెట్లు, బిస్కెట్‌లను విద్యార్థినీ, విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌కె ఖాదర్ ఉన్నీసాబేగం మాట్లాడుతూ 1997 నుండి 2002 వరకు తమ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ తాను చదివిన పాఠశాలను మరిచిపోకుండా విద్యార్థులకు సుమారు 500 మందికి సుమారు 50 వేల రూపాయల విలువగల సామాగ్రిని పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించండి

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని అన్ని గ్రామాలలో పశు యజమానులు గేదెలకు, దూడలకు, ఆవులకు, గాలికుంటు టీకాలు వేస్తున్నట్లు పశు వైద్యాధికారిని ఎం విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని ముండ్లమూరు, వేంపాడు, గ్రామాలలో మంగళవారం గేదలు 200, ఆవులు 150, దూడలు 50 టీకాలు వేసా మన్నారు. ఆమె మాట్లాడుతూ నోట్లో పుండ్లు రావడం, కాలి గిట్టల మధ్య పాచి పట్టి పుండ్లు ఏర్పడడం, ఈ వ్యాధి సోకిన పశువుల లో పాలు తగ్గిపోవడం, సరిగా నడవలేకపోవడం, నోటి నుండి సొంగ కారడవంటి లక్షణాలు ఉంటాయి అన్నారు. గ్రామాల లోని పశు పోషకులయజమానులు ఈ వ్యాధులను గుర్తించి గాలికుంటు టీకాలు వేయించాలని ఆమె అన్నారు. పశువైద్య సిబ్బంది వి అనుష, పి కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : అంధత్వ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అంధత్వ నివారణ అధికారి జడ ఉమా అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 రోజులు పాటు అంధత్వ నివారణ కార్యక్రమా లను ప్రజల వద్దకు తీసుకువెళ్లి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. నేత్రంపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్యవంతులు చేయడం జరుగుతుందన్నారు. అదృష్టవశాత్తు పోగొట్టుకున్న కంటి చూపును చికిత్స ద్వారా తిరిగి పొందవచ్చు అన్నారు. దీనికిగాను దానం చేయ బడిన కార్నియా మార్పిడి చేయడం జరుగుతుందన్నారు.

రవీంద్రబాబు పుట్టినరోజు సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర-ఒంగోలు : లక్ష్మి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత న్యూరోసర్జన్ డాక్టర్ రవీంద్ర బాబు అబ్బూరి పుట్టినరోజు సందర్భంగా ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయం లోని వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి జన్మదినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సినీ నటులు బీసీ సమైక్య సమితి రాష్ట్ర అధ్యక్షులు దన్నారపు మస్తాన్ రావు మాట్లాడుతూ పుట్టిన రోజున ఆడంబరాలకు పోకుండా ఇలా సమాజ సేవ చేయడం ఆదర్శనీయం అన్నారు. ఆకలిగొన్నవారికి పట్టెడన్నం పెట్టి వారి కళ్ళల్లో ఆనందం చూడటం ఎనలేని సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు గారి ఆధ్వర్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇబ్బంది పడుతున్న శివారు ప్రాంతంలోని పేదలకు అన్నదానం చేశారు.

మొక్కలు జీవ కోటికి ప్రాణవాయువు

విశాలాంధ్ర-ఒంగోలు : మొక్కలు జీవ కోటికి ప్రాణ వాయువును అందిస్తాయని అందువల్ల చెట్లను పెంచడం ద్వారా ప్రజలకు ఎంతగానో మేలు జరుగుతుందని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి అన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ తప్పకుండా కనీసం ఒక్క మొక్క అయినా నాటవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన హితవు పలికారు. మంగళ వారం ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో యూనివర్సిటీ కళాశాల సమీపంలో ఏ.కే.యు. ఎన్.ఎస్.ఎస్.కో ఆర్డినేటర్ డాక్టర్ మందే.హర్ష ప్రీతం దేవ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి ఉన్నారు.

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

సీఐ భీమా నాయక్

విశాలాంధ్ర-పామూరు : నిషేధిత గంజాయి,డ్రగ్స్ మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సిఐ భీమా నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక వివేక ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో నిషేధిత పదార్థాలపై అవగాహన సదస్సు ప్రిన్సిపాల్ మూర్తి మహా లక్ష్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐ భీమా నాయక్ మాట్లాడుతూ చెడు వ్యసనాలు కు దూరంగా ఉండాలన్నారు. సరదాగా మత్తు పదార్థాల జోలికి వెళ్లి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. తమ దృష్టి విద్యపై పెట్టి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. ద్విచక్రాల వాహనదారులు లైసెన్సులు కలిగి, తమ ప్రాణాలకు రక్షణ కవచం లాంటి హెల్మెట్ ను తప్పకుండా వాడాలని సూచనలు చేశారు.

వరద బాధితులకు సహాయ చర్యల్లో కోటపాటి

విశాలాంధ్ర-పామూరు : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పామూరు మండలం బొట్లగూడూరు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్‌రావు మంగళవారం తుఫాన్ వరద బాధితుల చర్యల్లో పాల్గొన్నారు. నీట మునిగిన వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో భాగంగా గొల్లపూడి సచివాలయం పరిధిలో అధికారుల ను సమన్వయ పరుచుకుని బాధితులకు ఆహార సరఫరా పై సమీక్షలు నిర్వహించి కార్యక్రమాల్లో జనార్ధన్ రావు పాల్గొంటున్నారు.

ముందస్తు అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : మార్కాపురం పట్టణంలో రాబోవు వినాయక చవితి పండుగ సందర్భంగా ఎవరైన వారి వార్డుల్లో, బజారులలో వినాయకుడు విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలంటే మరియు నిమజ్జనంకు పట్టణ పోలీసు వారి నుంచి ముందస్తుగా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మార్కాపురం పట్టణ ఎస్ఐ సైదుబాబు ప్రజలకు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక మంటపం ఏర్పాటు చేయు ప్రజల కోసం ప్రత్యేకంగా ఒక సింగిల్ విండో క్లియరెన్స్ విధానం తీసుకుని వచ్చిందన్నారు. ఇందుకోసం 7995095800 నెంబర్‌కు వాట్సప్‌లో హాయ్ అని మెసేజ్ పంపితే సింగిల్ విండో క్లియరెన్స్ కోసం విధివిధానాలను వారు మీకు పంపుతారని ఆయన తెలిపారు. కావున వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసే వారందరూ తగు జాగ్రత్తలు తీసుకుంటూ, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పండుగను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ సైదుబాబు తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేస్తున్న ప్రతి పంటను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఇ-పంట యాప్‌లో నమోదు చేసుకోవాలని పుల్లలచెరువు మండల వ్యవసాయాధికారిణి నిర్మల దేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



విజయవాడ బాధితులకు బాసటగా ఎమ్మెల్యే ఏలూరి

45 వేల మందికి ఆహార ప్యాకెట్లు తరలింపు

విశాలాంధ్ర - మార్టూరు : విజయవాడ వరద ముంపు బాధితులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బాసటగా నిలిచారు.వరద సహాయ చర్యల పర్యవేక్షణలో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనలో స్వయంగా ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఆహారం,తాగునీటి ప్యాకెట్లు అందుతున్న తీరుపై స్వయంగా పరిశీలించారు.వరద బాధితుల కష్టాలను చూసి ఎమ్మెల్యే ఏలూరి చలించి తల్లడిల్లి పోయారు.తలపెట్టిన ఏ కార్యాన్ని అయినా పూర్తి స్థాయిలో విజయవంతం చేసే ఎమ్మెల్యే ఏలూరి సమర్థత తెలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలోని విద్యాధరిపురం, సితార సెంటర్ మరికొన్ని కాలనీలలో సహాయ పనులకు ఇంచార్జ్‌గా ఎమ్మెల్యే ఏలూరిని నియమించారు.దీంతో ఆ కాలనీలో మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి పర్యటించి వరద బాధితుల కష్టాలను చూసి చలించిపోయారు.బాధపడవద్దని ప్రభుత్వం ఆదుకుంటుందని బాధితులకు ధైర్యం చెప్పారు.ప్రజలకు ఆహార పానీయాలు అందకపోవడంతో వారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు.వెంటనే మార్టూరులోని క్యాంపు కార్యాలయానికి ఫోన్ చేసి వెంటనే భోజనం ప్యాకెట్లు తయారుచేసి సాయంత్రానికి విజయవాడ పంపాలని ఆదేశించారు.ఎమ్మెల్యే ఏలూరి ఫోన్ కాల్‌తో ఆయన సైన్యం కార్యరంగంలోకి దిగింది.ఎమ్మెల్యే ఏలూరి పిలుపుమేరకు టిడిపి నాయకులు,అనుచరులు మార్టూరు ఎన్నారై టీడీపీ నాయకులు కార్యరంగంలోకి దిగి అప్పటికప్పుడు సరుకులు కొనుగోలు చేసి వంట మాస్టర్లను పిలిపించి ఆహార పదార్థాలను తయారు చేయించి తెలుగు యువత సహకారంతో డబ్బాలు ప్యాకెట్లలో ఆహారాన్ని నింపారు. దీంతోపాటు వేల సంఖ్యలో వాటర్ బాటిల్స్ సేకరించారు.వీటన్నిటిని ఎమ్మెల్యే ఏలూరి పంపించిన ప్రత్యేక వాహనాల్లో లోడ్ చేసి మంగళవారం సాయంకాలంకి విజయవాడ తరలించే విధంగా ఏర్పాటు చేశారు. చేతిలో ఎంత నగదున్నప్పటికీ ఆహారం మంచినీరు దొరకని పరిస్థితి ప్రస్తుతం విజయవాడలో నెలకొన్నది.దీనిని గమనించిన ఎమ్మెల్యే ఏలూరి వరద బాధితులకు ఆపన్నహస్తం అందించనున్నారు.

జీవి మనుగడకు ప్రమాదం ఏర్పడిన పరిస్థితుల్లో ఎమ్మెల్యే ఏలూరి ఆపద్బాంధవుడుగా నిలిచి వారికి అన్న పానీయాలు అందిస్తున్నారు.తాను ఇంచార్జిగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి కష్టాలు రాకూడదని అన్ని తానై వ్యవహరిస్తూ బాధితులకు అండగా నిలుస్తూ వారి మన్ననలు పొందారు.సహజంగా సేవా తత్పరుడైన ఎమ్మెల్యే ఏలూరిని నేటి తరం రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని బాధితులు వ్యాఖ్యానిస్తున్నారు.అలాగే ఎమ్మెల్యే ఏలూరి పిలుపుతో పలువురు నేతలు వరద బాధితులకు ఆహారం, మంచినీళ్ళు అందించేలా చర్యలు చేపట్టారు.

జాబ్ మేళాలో 40 మంది విద్యార్థులకు ఉపాధి

విశాలాంధ్ర - రేపల్లె : స్థానిక శారదా ఐటిఐ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా జరిగినది. ఈ జాబ్ మేళాలో మూడు కంపెనీల మేనేజర్లు, పాల్గొన్నారు.వీరు కోల్గేట్ కంపెనీ,టిహెచ్‌కె జపనీస్ కంపెనీ,శ్రీ సిటీకు చెందినది కాగా మూడవది హీల్ ఫోర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గుంటూరు వీరిలో మొత్తం 40 మంది విద్యార్థులు హాజరుతో కోల్గేట్ కంపెనీ వాళ్ళు 20 మంది అభ్యర్థులను,టిహెచ్‌కె జపనీస్ కంపెనీ వారు నలుగురు అభ్యర్థులను,గుంటూరు నుండి వచ్చిన హీల్ ఫోర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు 15 మంది అభ్యర్థులను, ఎంపిక చేసుకున్నారు. వీరికి ఉచిత భోజనముతో పాటు వసతి సౌకర్యాలతో రూ.15వేల వేతనము నెలకు ఇవ్వబడుతుందని, ఒక సంవత్సరం అప్రెంటిస్ ఇవ్వబడుతుందని, తెలియజేశారు. ఈ జాబ్ మేళా కార్యక్రమంలో కోల్గేట్ కంపెనీ, టిహెచ్ కంపెనీ తరఫున పి.చందు, హీల్ ఫోర్స్ ఇండియా కంపెనీ జనరల్ మేనేజర్ ఇ.వరప్రసాద్, కరెస్పాండెంట్ బడుగు వెంకటనారాయణ, ప్లేస్మెంట్ ఆఫీసర్ మండే ప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ఒంగోలు : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టపరచాలని, అర్హులైన వారందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని, పెట్రోల్ ' డీజిల్ ధరలు తగ్గించాలని ఒంగోలు మండల సీపీఐ కార్యదర్శి గద్దల రవి ఒక ప్రకటనలో కోరారు. సీపీఐ దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా ఈ నెల 1 నుండి 5వ తేదీ వరకు చేపట్టటం జరుగుతుంది. చివరి రోజైన 6వ తేదీన అన్ని కలెక్టర్ ఆఫీసుల వద్ద ధర్నా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అదే క్రమంలో 6వ తేదీ శుక్రవారం ఒంగోలు కలెక్టర్ ఆఫీసు వద్ద భారీ ఎత్తున జరుగు ధర్నా కార్యక్రమానికి 'పార్టీ కార్యకర్తలు 'సభ్యులు 'ప్రజానీకం పాల్గొని విజయవంతం చేయాలని గద్దల రవి ఒక ప్రకటనలో కోరారు.

వరద బాధితులకు సహాయం, పునరావాసం అందించాలి

- ఏపీ రైతు కూలీ సంఘం

విశాలాంధ్ర-ఒంగోలు : రాష్ట్రంలో అధిక వర్షాలతో వరదలతో అల్లాడుతున్న ప్రజలను ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన సహాయ పునరావాసం అందించాలని రైతు కూలి సంఘం(ఏపి) ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఆగస్టు 30, 31 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు ప్రజా జీవితాన్ని అతలా కుతలం చేశాయి. విజయవాడ నగరంలోని పలు ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లోని దాదాపు 5 లక్షల మంది ప్రజానీకాన్ని హఠాత్తుగా వరద బాధితులుగా మిగిల్చాయి. ఈ భారీ వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడి ఐదుగురు మృతిచెందగా, మొత్తంగా వరద బారిన పడి వివిధ ఘటనలలో 20 మందికి పైగా మరణించారు. మృతి చెందిన వారికి రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) సంతాపం తెలుపుతున్నదని ఎపి రైతు కూలి సంఘం రాష్ట్ర నాయకురాలు ఎస్ లలితకుమారి అన్నారు. ఉమ్మడి- గుంటూరు, కృష్ణ,పశ్చిమగోదావరి జిల్లాలలో లక్షలాది ఎకరాలలో నాటిన వరి, ప్రత్తి, మిరప తదితర పంటలు నీట మునిగాయని తెలిపారు.

జాతీయ క్రీడలకు చైతన్య విద్యార్థులు

విశాలాంధ్ర-దర్శి : దరిశి శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు జాతీయ కుస్తీ పోటీలలో ప్రతిభ చూపారు. రేణిగుంట, తిరుపతిలో జరిగిన 4వ అంతరాష్ట్ర కుస్తీ పోటీలలో గెలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను సిఐ రామారావు, ఎస్సై మురళీలు విద్యార్థులను అభినందించారు. సిఐ రామారావు మాట్లాతు జాతీయ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు.విద్యార్థులు చదువుతో పాటు సమానంగా ఆటల పట్ల శ్రద్ధ చూపాలని, శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏ.జి.యం అంజయ్య తెలిపారు.. ఈ సందర్భంగా విజేతల తల్లి దండ్రులను సత్కరించారు. ప్రతిభ చూపిన కె.జయ సాయి హర్ష వర్ధన్ రెడ్డి, పి. రాజేంద్ర సాయి, యస్. హేమంత్ లను ఆర్.ఐ అనిల్ , ప్రిన్సిపాల్ ఉదయ శ్రీ, కో ఆర్డినేటర్ వీరాంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ ఖాదర్ భాష, డీన్ రామచంద్ర, ప్రైమరీ ఇంచార్జి ప్రభావతి, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ షహనాజ్, ఉపాధ్యాయులు అభినందించారు.

పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి

సీపీఐ నేత ఎం.రమేష్ బాబు

విశాలాంధ్ర-దర్శి : పెరిగిన నిత్యవసర ధరలు అదుపు చేయాలంటే పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. దేశవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రతిష్ట పరచాలని పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని కోరుతూ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు అని తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను మంగళవారం స్థానిక గుజ్జుల సరళ దేవి భవన్ సిపిఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. రమేష్ బాబు మాట్లాడుతూ రోజురోజుకు నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని సామాన్య ప్రజలు ఏం తినేటట్టు కొనేటట్టు లేవని వాపోయారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులు ఇవ్వాల్సిన ప్రభుత్వాలు కేవలం నాసిరకం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తూ సరిపెడుతున్నారని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను దృష్టిలో పెట్టుకొని నిత్యవసర వస్తువుల ధరలు పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించి ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రతిష్టపరచాలని కోరారు లేదంటే సిపిఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ నాయకులు కే హనుమంతరావు, బికెఎంయు జూపల్లి కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్ కరుణానిధి, వెంకటేశ్వర్లు, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టునందు

I.A. 230/2022 in O.S. 104/2022

మధ్య

బోయపాటి పేరయ్య -- వాది

మరియు

పత్తిపాటి శ్రీకాంత్ -- ప్రతివాది

టు : పత్తిపాటి శ్రీకాంత్, తండ్రి వెంకటేశ్వర్లు, నివాసం: కామేపల్లి గ్రామం మరియు పోస్టు, జరుగుమల్లి మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావానందు ప్రతివాది మరియు పై నంబరు దావా నందలి I.A. నంబరు **230/2022** నందు రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టువారు దావా సమన్లను మరియు I.A. నోటీసులను పలుమార్లు శ్రీకోర్టు ద్వారానూ మరియు రిజిస్టర్ పోస్టు ద్వారానూ పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందు శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు ఈ నోటీసు ద్వారా మీకు తెలియచేయునది ఏమనగా ది. **22-11-2024**వ **తేదీన ఉదయం 10:30 నిమిషములకు** పై కోర్టువారి ఎదుట స్వయముగా కానీ, న్యాయవాది ద్వారాకానీ హాజరై పై నెంబరు దావానందు మీకు కల అభ్యంతరములు కానీ, ఆక్షేపణలు కానీ తెలియపరుచుకొనగలరు. లేని ఎడల పై నెంబరు దావా మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా మీకు తెలియచేయటమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 22-11-2024

అనమనమూడి అజయ్‌బాబు
మధిర సామ్రాజ్యం, శబరి దీక్షచౌదరి
న్యాయవాదులు, వినుకొండ- 522647
సెల్ : 94408 63275

గణేష్ ఉత్సవాలకు అనుమతులు పొందాలి

విశాలాంధ్ర-కొమరోలు : సింగిల్ విండో సిస్టం ద్వారా గణేష్ ఉత్సవాలకు అనుమతులను పొందాలని కొమరోలు మండల సబ్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక మంటపం ఏర్పాటు చేయు ప్రజల కోసం ప్రత్యేకంగా ఒక సింగిల్ విండో క్లియరెన్స్ విధానం తీసుకుని వచ్చిందని, ఇంతకు ముందు వినాయక మంటపం ఏర్పాటు కోసం ప్రజలు అగ్నిమాపక శాఖ, పురపాలక శాఖ, విద్యుత్ శాఖ మరియు పోలీసు శాఖల నుంచి నిరభ్యంతర పత్రం తీసుకోవలసి ఉండేదని, దీనికోసం ప్రజలు ఆయా శాఖల చుట్టూ తిరగవలసి వచ్చేది. ప్రజల వెసులుబాటు కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సింగిల్ విండో క్లియరెన్స్ విధానం రూపొందించినదని కొమరోలు మండలంలో ఎవరు గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేయాలనుకున్న సింగిల్ విండో క్లియరెన్స్ తీసుకోవాలని అన్నారు. ఇందుకోసం 7995095800 నెంబర్ కు " వాట్సప్ " లో హాయ్ అని మెసేజ్ పంపితే సింగిల్ విండో క్లియరెన్స్ కోసం విధివిధానాలను వారు మీకు పంపుతారని ఆయన తెలిపారు.

నరసయ్యకు పెన్షన్ అందజేత

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండలంలోని వద్దిమడుగు గ్రామానికి చెందిన గౌతుకట్ల నర్సయ్య కిడ్నీ వ్యాధితో ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం వద్దిమడుగు డిజిటల్ అసిస్టెంట్ చంద్రశేఖర్ ఒంగోల్ కిమ్స్ వైద్యశాలకు వెళ్లి పింఛన్ అందజేశారు. పెన్షన్ అందజేసిన చంద్రశేఖర్‌ను గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఆహారం ప్యాకెట్లు పంపిణీ

విశాలాంధ్ర-పామూరు : విజయవాడ నగరాన్ని అతలాకుచలం చేసిన తుఫాను వరద బాధితులు ఆహారానికి నోచుకోని తరుణంలో మధువన్ గ్రూప్ ఆఫ్ హెూటల్స్ వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మూడవ రోజు మంగళవారం డిజిపి ద్వారకా తిరుమలరావు, డి పి టి యు దానం, ఆర్టీసీ రమేష్ ఆదేశాలతో భోజనం ప్యాకెట్లు కాకొల్లు నాగేశ్వరరావు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్‌లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మధువన్ గ్రూప్ ఆఫ్ హెూటల్స్ అధినేత కాకొల్లు నాగేశ్వరరావు, దారపనేని చంద్రశేఖర్ లు మాట్లాడుతూ విజయవాడ ను ముంచెత్తిన తుఫాను ప్రభావంతో ఎంతోమంది నిరాశ్రితులకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేసి తమ వంతు ఔన్నత్యాన్ని చాటుకున్నామని తెలిపారు. మధువన్ గ్రూప్ ఆఫ్ హెూటల్స్ అధినేత కాకొల్లు నాగేశ్వరరావు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్ర శేఖర్, చెరుకూరి శీను, డాక్టర్ వీరేంద్ర చౌదరి, యలమంచిలి నాని, దుగ్గినేని వెంకట్ భోజనం ప్యాకెట్ల పంపిణీలో పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పామూరు : పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రమైన పామూరు పట్టణంలో రక్తదాన శిబిరమును ఆ పార్టీ మండల అధ్యక్షులు దర్శి ఏడుకొండలు ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహించారు. స్థానిక పద్మావతి అతిథి గృహంలో నిర్వహించిన రక్తదాన శిబిరములో 75 మంది యువతీ, యువకులు పాల్గొని రక్త దానం చేశారు.

ఆందోళకరంగా చెరువుకట్టల పటిష్టత

విశాలాంధ్ర-పుల్లలచెరువు : పుల్లలచెరువు మండలంలో చిన్నకండ్లేరు చెరువు సాగునీటి చెరువుకట్టల పటిష్టత సన్నగిల్లుతున్నా సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ మండలంలోని రైతులందరు కేవలం వర్షం మీద ఆధారపడే పంటలు సాగుచెయ్యటం తప్ప మరోమార్గం లేదు. ఎలాంటి సాగునీటి సదుపాయాలు లేవు. అందువల్ల రైతులు పంటలు పండించాలి అంటే చెరువులే ప్రధానం. అయితే గతంలో ఎప్పుడో నిర్మించిన చెరువుకట్టలు పాతబడిపోయి పటిష్టత సన్నగిల్లి కట్టకు గండ్లుపడి తెగిపోయేప్రమాదం కూడా లేకపోలేదు. మండలంలోని అతి పెద్దచెరువైన చిన్నకండ్లేరు చెరువుకట్టకు గత సవత్సరం గండిపడి నీరంతా వృధాగా పోవటం వలన ఆ చెరువుక్రింద పంట సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. అందువల్ల ప్రస్తుతం తుఫాను వర్షాకాలం మొదలై తరచుగా వానలు కురుస్తుండంతో చెరువులకు 20 అడుగులు మేర నీరు చేరింది. ఇరిగేషన్ అధికారులు కలెక్టర్, సబ్ కలెక్టర్లు ఇటీవల కాలంలో చెరువులను సందర్శించారు. వాస్తవంగా వర్షకాలం మొదలవ్వగానే ఇరిగేషన్ అధికారులు చెరువుల భద్రతపట్ల అప్రమతంగా ఉండాల్సిన అవసరం ఉంది కాని ఇక్కడ అలాంటి ఆనవాలు ఏమి కనిపించడంలేదు. అందువలన ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు చెరువుకట్టల పటిష్టతపై దృష్టి సారించి కట్టలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. చెరువు కట్టపై చిల్లకంపతో నిండి ఉన్నది. చినకండ్లేరు చెరువు కింద పంట కాలువలు కూడా అధ్వాన్నంగా తయారయ్యాయి. ముఖ్యంగా చిన్నకండ్లేరు చెరువు పూల సుబ్బయ్య ప్రాజెక్టు పరిధిలో తీగలేరు 5 కాలువ అనుసంధానంగా కూడా గత ప్రభుత్వంలో నిధులు కేటాయించిన పనులకు నోచుకోలేదు. నూతన ప్రభుత్వం అయినా నిధులు మంజూరు చేసి పనులు చేపట్టనట్లయితే ఈ చిన్నకండ్లేరు చెరువుకింద దాదాపు 1800 నుంచి 1900 ఎకరాలు పొలం ఉందని సాగులోకి వస్తే ఇటు రైతాంగానికి అటు వలసలు వెళ్ళకుండా నివారించడానికి ఉపయోగకరంగా ఉంటుందని ఏళ్ల తరబడి ఈ ప్రాంత రైతులు ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఉన్న నీటిమట్టం కంటే ఇంకా పది అడుగులు నీరు వస్తే చెరువు కట్టకు ప్రమాదమని చెరువు సందర్శించిన ఇరిగేషన్ ఎస్సీ తెలిపినట్లు రైతులు తెలిపారు. అధికారులు సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు చిన్న కండ్లేరుచెరువు ప్రాజెక్ట్ పనులు రెండు మూడు రోజుల్లో కొంతమేరకైనా మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

శంకర్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

రూ.50 వేలు ఆర్థిక సాయం అందించిన 'దద్దాల'

విశాలాంధ్ర-పామూరు : మండల లోని వగ్గంపల్లి పంచాయతీకి చెందిన వైసీపీ కార్యకర్త బైరెడ్డి శంకర్ రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కనిగిరి వైసీపీ ఇన్చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ మంగళవారం శంకర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని శంకర్ రెడ్డి కుటుంబ సభ్యులకు నారాయణ యాదవ్ భరోసా ఇచ్చి 50వేల రూపాయలను ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి, అంబటి కొండారెడ్డి,పార్టీ పట్టణ అధ్యక్షులు సెంట్రింగ్ చాంద్ బాషా,గట్లా విజయభాస్కర్ రెడ్డి, శ్రీరామ్ శ్రీను,జొన్నలగడ్డ ప్రహ్లాద,వెంకట నారాయణ, గంధం భాస్కర్, గుమ్మల్ల వెంకటేశ్వర్లు, మడతల చిరంజీవి, తెలికట్ల శ్రీను, ఎలిహేజర్, నాయబ్ రసూల్ (బడే) దబ్బుకొట్టు వెంకటేష్, జయరావు,స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, గోళ్ళిక్ల శ్రీను, నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ మద్రి రాజు పాల్గొన్నారు.

అన్యాక్రాంత భూములు దళితులకు ఇచ్చేవరకు ఉద్యమిస్తాం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

విశాలాంధ్ర-పీసీపల్లి : పీసీపల్లి మండలంలోని కోదండరామపురం మెట్లవారిపల్లి గ్రామాలకు చెందిన దళితులభూములు అన్యాక్రాంతమయ్యాయని అక్రమ రిజిస్ట్రేషన్స్ జరిగాయని ఆ భూములను ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇచ్చేవరకు ఉద్యమిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. దళితులు సాగుచేసుకుంటున్న భూమి ప్రదేశానికి వెళ్లి విత్తనాలు చల్లుతున్న పేదలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు గ్రామాలకు చెందిన నిరుపేదలైన 22 కుటుంబాల వారికి 1994లో అప్పటి ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 44 ఎకరాలు భూమి కొనుగోలు పథకం కింద కొని అందజేసిందని దానికి సంబంధించిన ఒరిజినల్ పట్టాలు నేటికీ పేదల చేతుల్లోనే ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఆ భూములు అభివృద్ధి చేసుకునేందుకు బావులు తవ్వు కునేందుకు సాగు యోగ్యంగా మార్చు కునేందుకు ప్రభుత్వం బ్యాంకు నుండి ఎకరాకు 8500 రూపాయలు చొప్పున పట్టాలు తాకట్టు పెట్టుకుని రుణాలు ఇవ్వటం జరిగిందని తెలిపారు. వర్షం పడక సాగుకు యోగ్యంకాని స్థితిలో ఆ భూములను వాళ్ళు పడవుగా పెట్టి రెండు మూడు సంవత్సరాలు వలసపోయారని తెలిపారు. ఆ తర్వాత కొందరు వ్యక్తులు కౌలుకి ఇవ్వమని అడగగా వీరంతా ఇచ్చారని తెలిపారు. కౌలుకు తీసుకున్న వారు 2009లో మళ్లీ రుణాలు ఇప్పిస్తాము కనిగిరి రమ్మని నిరక్షరాస్యులు నిరుపేదలైన భూమి కలిగిన వారి వేలిముద్రలు వేయించుకొని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అన్నారు. ఒరిజినల్ పట్టాలు బ్యాంకు తాకట్టులో ఉండగా రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని ఆయన ప్రశ్నించారు. ఇది కచ్చితంగా అక్రమ మార్గంలోనే జరిగిందని ఆయన అన్నారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దుచేసి అర్హులైన ఆ పేద కుటుంబాలకు ఆ భూమిని ప్రభుత్వ అందజేయాలని అప్పటివరకు ఆ పేదలకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందని ఆయన తెలిపారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2023లో నాటి వైసిపి ప్రభుత్వం దళితులు బ్యాంకులో తీసుకున్న రుణాలు మొత్తం రద్దు చేశామని చెప్పి ఆ భూములపై పేదలకు శాశ్వత హక్కు పత్రాలు అందించారని ప్రభుత్వం శాశ్వత పత్రాలు ఇచ్చిన తర్వాత పేదలు పడవుగా ఉన్న ఆ భూముల్లో సాగు చేసుకునేందుకు ప్రయత్నించారని ఆ సందర్భంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న పెద్ద మనుషులు అధికారులు ద్వారా పోలీసులు ద్వారా పేదలను వారి భూమిలోకి వారిని వెళ్ళనీయకుండా బెదిరింపులకు పాల్పడుతూ అడ్డుకుంటున్నారని అన్నారు. ఈ దుర్మార్గాన్ని ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సాగుదారులైన పేదలు ఎర్రగుంట్ల బాలయ్య, రాగి మార్కండేయులు, డి.నారాయణ, వై. చిన్న బాలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం పెద్దచెర్లోపల్లి మండల కార్యదర్శి బడుగు జనార్దన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చూపిన 'ప్రకాశం'

- కలెక్టర్ ఆధ్వర్యంలో విజయవాడకు 20వేల ఆహార పొట్లాలు
- ఎమ్మెల్యే దామచర్ల ఆధ్వర్యంలో 30వేల ఆహార పొట్లాలు, మంచినీటి బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు తరలింపు
- రెండు వేల ఆహార పొట్లాలు అందజేసిన శ్రీ ప్రతిభ విద్యాసంస్థలు
- వరద సాయం కోసం రూ.7లక్షల చెక్కును లోకేష్‌కు అందజేసిన 'శ్రీ సరస్వతి' విద్యాసంస్థలు
- రూ.లక్ష వరద సాయం అందజేసిన పేర్నమిట్ట సుబ్బయ్య స్కూల్ యాజమాన్యం

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రకాశం జిల్లా నుండి విజయవాడకు సుమారు ఒక లక్షా 20 వేల ఆహార ప్యాకెట్లు దాతల సహకారంతో పంపించేందుకు జిల్లా యంత్రాంగం అన్నీ చర్యలు చేపట్టడం జరిగింది. అందులో భాగంగానే ఏ 1 కన్వెన్షన్ సెంటర్, బచ్చల బాలయ్య కళ్యాణ మండపంలో ఆహార పాకెట్స్ ను సిద్ధం చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా మంగళవారం ఉదయం పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. తొలుత జిల్లా కలెక్టర్ ఏ 1 కన్వెన్షన్ సెంటర్ ను సందర్శించి విజయవాడకు పంపుటకు సిద్ధం చేస్తున్న ఆహార పాకెట్స్ ను పరిశీలించి ఆహారంను స్వయంగా తిని చూశారు. సకాలంలో వరద బాధితులకు ఆహార పాకెట్స్ అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విజయవాడకు తరలించే ఆహారాన్ని నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రైల్వే స్టేషన్ రోడ్డులో గల బచ్చల బాలయ్య కళ్యాణ మండపంను సందర్శించి విజయవాడకు పంపుటకు సిద్ధం చేస్తున్న ఆహార పాకెట్స్ ను పరిశీలించి ఆహారంను తిని చూశారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ సుబ్బారెడ్డి, డిఆర్డిఏ పిడి వసుంధర, డిటీసీ సుశీల, చదలవాడ పశు ఉత్పత్తి క్షేత్రం డిడి శ్రీ రవి కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దామచర్ల ఆధ్వర్యంలో....

విజయవాడ ను ముంచేత్తుతున్న భారీ వరదలు కారణంగా ఇబ్బంది పడుతున్న విజయవాడ ప్రజలు కోసం ఒంగోలు నియోజకవర్గ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ ఆధ్వర్యంలో ఒంగోలు నుండి 30 వేల మందికి పులిహోర, 20 వేల వాటర్ బాటిల్స్ మరియు 15 వేల బిస్కెట్ పాకెట్స్ 3 లారీల్లో జెండా ఊపి విజయవాడ కు పంపారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ ఎత్తున సంభవించిన వరదలతో ముంపు బాధితులు పడుతున్న ఇబ్బందులను చూసి చాలా బాధ కలిగిందన్నారు వరద బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలు తనను ఎంతో బాధకు గురి చేశాయని, బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న సాయంలో తన వంతుగా భాగస్వామి అయ్యేందుకు ఈ సహాయం చేయడం జరుగుతుంది అని తెలిపారు. వారిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో పాలుపంచుకునేందుకు ఈ మేరకు సహాయం చేయుటకు నేను ముందుకు రావడం జరిగిందన్నారు. ఇలాంటి విపత్తు సమయంలో అందరూ ముందుకొచ్చి సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, నగర పార్టీ నాయకులు,మహిళా నాయకులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ ప్రతిభ విద్యాసంస్థల ఆధ్వర్యంలో.....

రాష్ట్రంలో భారీ వర్షాలు కారణంగా వరద నీటిలో చిక్కుకుపోయిన బాధితులకు ఆహారం అందించేందుకు శ్రీ ప్రతిభ విద్యాసంస్థల యాజమాన్యం నడుము కట్టింది. అందులో భాగంగా 2వేల పులిహోర ప్యాకెట్లను ప్యాకింగ్ చేయించి బస్సుల ద్వారా ప్రకాశం జిల్లా డిఇఓ కార్యాలయానికి తరలించారు. శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వరదలలో చిక్కుకున్న ప్రజలను చూసి మనసు కలచివేసింది అన్నారు. వెంటనే ఏదైనా సహాయం చేయాలని నిర్ణయం తీసుకుని వెంటనే ఆహార అందించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా 2వేల పులిహోర ప్యాకెట్లను తయారు చేయించడమే కాకుండా బస్సులలో ప్రకాశం జిల్లా డిఇఓ కార్యాలయానికి తరలించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రతిభ విద్యాసంస్థల వైస్ చైర్మన్ సీతా రామాంజనేయులు, సీఈవో జయప్రకాష్ నారాయణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ సరస్వతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో.....

వాయుగుండం ప్రభావంతో విజయవాడలో కురిసిన భారీ వర్షాలకు అనేక ప్రాంతాలు నీట మునిగాయి. వరద నీరు పోటెత్తడంతో విజయవాడలోని పలు ప్రాంతాల్లో సాయం కోసం ప్రజలు ఎదురుచూపులు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో వరద బాధితులకు సాయం అందించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుమేరకు ఒంగోలులోని శ్రీ సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఎవి.రమణారెడ్డి స్పందించారు.

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని ఏవి రమణారెడ్డి కలిశారు. వరద బాధితుల సహాయార్థం శ్రీసరస్వతి విద్యాసంస్థల తరపున రూ. 7 లక్షల విరాళాన్ని మంత్రి నారా లోకేష్ కి అందించారు. వరద బాధితులకి సాయం అందించేందుకు ముందుకు వచ్చిన ఏవి రమణారెడ్డి ని మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అభినందించారు.

సుబ్బయ్య స్కూల్ ఆధ్వర్యంలో...

పేర్నమిట్ట సుబ్బయ్య స్కూల్ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం రూ. 1లక్షను ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు నేతృత్వంలో విజయవాడలో రాష్ట్ర మంత్రి లోకేష్‌కు అందజేసారు.

విజయవాడ వరద బాధితులకు 'శ్రీ హర్షిణీ' చేయూత

విశాలాంధ్ర-ఒంగోలు : రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు విజయవాడ, రాజధాని పరిసర ప్రాంతాలలో నివాస ప్రాంతాలు నీట మునిగి ఎంతోమంది ఆహారం లేక పిల్లలు, పెద్దలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా స్థానిక ఒంగోలులోని శ్రీహర్షిణి విద్యాసంస్థల అధినేత మరియు దర్శి నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ గోరంట్ల రవికుమార్ విజయవాడ వరద బాధితులకు 2000 మందికి పైగా ఆహారపు ప్యాకెట్లు మరియు వాటర్ బాటిల్ లను తన సొంత నిధులతో ఏర్పాటుచేసి మంగళవారం విజయవాడ పంపించడం జరిగినది, ఇవే కాకుండా గతంలో కూడా ఎన్నోసార్లు విపత్తుల సంభవించినప్పుడు గోరంట్ల రవికుమార్ తన సహాయ సహకారాలు అందించడం జరుగుతూ ఉంటుంది. ఇంకా ఈ కార్యక్రమంలో విజేత పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ విజేత రమణ, శివరాం,కళాశాల డీన్ దాది ఆంజనేయులు, దుర్గ ఆంజనేయులు, బాలకృష్ణ, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

ఇంటింటికి మెరుగైన వైద్యం అందించాలి

విశాలాంధ్ర - కొరిశపాడు : హెచ్ఐవి ఎయిడ్స్ నిర్మూలనకు హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు క్షేత్రస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆశ వర్కర్స్ వైద్య సేవలు అందించడం చాలా విలువైన అమూల్యమైనవిగా భావించాలని మేదరమెట్ల ప్రాథమిక వైద్యశాల వైద్య అధికారి డాక్టర్ చిట్టిబాబు పేర్కొన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టిఐ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల దినోత్సవం కార్యక్రమమును హెల్ప్ టిఐ ఏఎన్ఎం రాదా అధ్యక్షతన మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వైద్య అధికారి డాక్టర్ జి.చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆశా కార్యకర్తల యొక్క వైద్య సేవలు చాలా విలువైనవని, సీజనల్ వ్యాధులు సంక్రమించినప్పుడు వారు క్షేత్రస్థాయిలో వ్యాధిగ్రస్తులకు ఎప్పటికప్పుడు సకాలంలో వైద్య సేవలు మందుల అందిస్తుంటారని, వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ప్రజలకు శుభ్రత పరిశుభ్రత గురించి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రజలు వ్యాధులు గురి కాకుండా అప్రమత్తం చూస్తూ ఉంటారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఎడిషన్ మండలి వారి ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్ సమూల నిర్మూలన లక్ష్యంతో రూపొందించిన మీకు తెలుసా ఐఇసి అవగాహన కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతంలో క్షేత్రస్థాయిలోకి స్థాయిలో తీసుకుని వెళ్లి హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనలో వీరి పాత్ర చాలా కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపిహెచ్ ఈవోలు బ్రహ్మానందం, ఎస్.కె మహబూబ్ జానీ, పిహెచ్ ఎన్.కే సుధా, ఓవి పద్మావతి పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగును గుర్తించాలి

విశాలాంధ్ర - కొరిశపాడు : రెండు మూడు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు అక్కడక్కడ మొక్కజొన్న పంటలలో కత్తెర పురుగులు గుర్తించి వాటి నివారణకు తక్షణమే తగు చర్యలు తీసుకొని తొలగించి పంటలు కాపాడుకోవాలని కొరిశపాడు మండల వ్యవసాయ అధికారి పి.శ్రీనివాసరావు రైతులకు తెలిపారు. మంగళవారం దైవాల, రావూరు, రావినూతల, కుర్రావానిపాలెం గ్రామాలలో ఎక్కువగా మొక్కజొన్న పంట వేయడం జరిగిందనీ పంట పెరుగు దశలో అపారమైన నష్టం కలిగిస్తున్న లద్దె పురుగు జాతికి చెందిన కత్తెర పురుగు రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని గుర్తించారు.

రేషన్ కార్డులు ఇవ్వాలి

నిత్యావసర వస్తువుల ధరలను అదుపుచేయాలి

విశాలాంధ్ర-పామూరు : ఈ నెల ఆరో తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి పి. ప్రభాకర్ కోరారు. మంగళవారం స్థానిక గుజ్జుల ఎలమందారెడ్డి భవన్ (సిపిఐ ఆఫీస్) నందు ధర్నాకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ బీజేపీ అనేక తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి ప్రభుత్వ రంగ సంస్థలను కారు సౌకగా కార్పొరేట్ బహుళ జాతి సంస్థలకు కట్టబెట్టడానికి పూనుకుందన్నారు. నిత్యవసర వస్తువులు ధరలు తగ్గిస్తానని,ప్రజా పంపిణీ సక్రమంగా అమలు చేస్తానన్న వాగ్దానాలను నెరవేర్చక వంటగ్యాస్ తో పాటు నిత్యవసర వస్తువులపై మోయలేని భారం పెంచిందన్నారు. పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు పేద వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని, పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని 6వ తేదీ ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగు ధర్నాలో ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి సుబ్బారావు, మండల కార్యదర్శి ప్రభాకర్, సిపిఐ నాయకులు మోహన్ రావు, ప్రసాదు, వెంకట్ రెడ్డి, ఫ్రాన్సిస్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నారాయణ,సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

బాధితులకు మంత్రుల పరామర్శ

విశాలాంధ్ర - రేపల్లె : వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. మంగళవారం ముంపు ప్రాంతాల్లో పర్యటించి వారితో మాట్లాడారు. గత రెండు రోజులుగా వరద ఉధృతి మంగళవారానికి కృష్ణానదిలో మూడు అడుగులు తగ్గిందన్నారు. 2019 ఎన్నికలకు ముందు ప్రచారంలో భాగంగా కరకట్టలను బలోపేతం చేయడానికి ప్రణాళికలు రూపొంది ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని మాజీ సీఎం జగన్ హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల పాలనలో కరకట్టల బలోపేతానికి ఒక రూపాయి విధించిన పాపాన పోలేదని మంత్రి విమర్శించారు. వాటికి కనీసం మరమ్మత్తులు కూడా ఏళ్ల తరబడి చేయకపోవడంతో అవి లీకులు దశకు, కొన్నిచోట్ల గండ్లు పడి,మరికొన్నిచోట్ల ప్రమాదస్థితి చేరుకున్నాయని ఈ క్రమంలో ఎడతెరిపిలేని వర్షాలకు తోడు పైనుంచి వరద నీరు ప్రకాశం బ్యారేజీకి పోటు ఎత్తడంతో రికార్డు స్థాయిలో గత శతాబ్ద కాలంలో ఎన్నడు లేని విధంగా 11.5 లక్షల ఇసుక్కుల నీటిని దిగువ కొరకు విడుదల చేయడంతో కొల్లూరు, రేపల్లె, భట్టిప్రోలు మండలాల పరిధిలోని 30 లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని, వరద బాధిత కుటుంబాలకు తాగునీరు, భోజనం, శానిటేషన్,వంటి అత్యవసర వసతి సౌకర్యాలు అధికారులు కల్పించడం జరిగిందని, రానున్న రోజుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండి విపత్తును ఎదుర్కొనే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సత్య ప్రసాద్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు లంక గ్రామాలు,పల్లిపాలెం గ్రామ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయక చర్యలు చేపట్టుతున్నామని, వారికి కావలసిన భోజనం, తాగునీరు, శానిటేషన్, మందులు, ఇతర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని బాధితులు అధైర్యపడవద్దని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వరద బాధిత కుటుంబాలకు హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ దూడి,బాపట్ల ఎంపీ తన్నేటి కృష్ణ ప్రసాద్, ఆర్డిఓ హేలా షారోన్,విపత్తుల నివారణ సంస్థ ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలి

పీవీఆర్ చౌదరి

విశాలాంధ్ర-ఒంగోలు : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ ఈనెల ఆరో తేదీన ఒంగోలులో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నారని సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి అన్నారు. మంగళవారం ఒంగోలులో సిపిఐ దేశవ్యాప్త ఆందోళన భాగంగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి గెలుపొందిన తర్వాత సామాన్యులను గాలి వదిలేసారన్నారు. రోజురోజుకు నిత్యవసర వస్తువులు ధరలు ఆకాశానంటుతున్నాయని బియ్యము పప్పులు, చింతపండు వంటి నిత్యవసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు కూడా ఆకాశానంటుతున్నా యన్నారు. పేద సామాన్య మధ్యతరగతి ప్రజలు ఏవి కొనేటట్టు లేదని తినేటట్లు లేదని ఆందోళన చెందుతున్నారన్నారు. దీనికి గోరుచుట్టు మీద రోకటిపోటు సందంగా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు విపరీతంగా పెంచారన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పక్కదారి పట్టిందని ధరలు స్థిరీకరణకు నిధిని ఏర్పాటు చేయలేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అక్రమంగా నిల్వ ఉంచిన కార్పొరేట్ బడా గుత్త పెట్టుబడి దారులకు కొమ్ము కాస్తున్నాయని దుయ్యబెట్టారు. కేరళ తరహా నిత్యవసర వస్తువులను సబ్సిడీ రేట్లు కు కు చౌక డిపోల ద్వారా అందించాలని ఆహార భద్రత చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని రేషన్ కార్డులను ఈ కేవైసీ ప్రక్రియ సులభతరం చేసి సరైన ఏర్పాటు చేయాలని కోరారు. ఒంగోలులో నగరంలో అనేక వీధుల్లో ప్రచార ఆందోళన కార్యక్రమం నిర్వహించారని ప్రధానంగా కొత్త కూరగాయల మార్కెట్, బాబూజీ మార్కెట్, ట్రంకు రోడ్డు, కర్నూలు రోడ్డు, గాంధీ రోడ్డు ,పప్పు బజారు, బండ్లమిట్ట ప్రాంతాల్లో కార్యక్రమం నిర్వహించారు అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు ,శ్రీరామ శ్రీనివాసరావు, భూదురి హరికృష్ణ పీవీ కృష్ణారావు, ఎస్ డి.సలార్ సుందరం, నరసింహారావు, దాని యల్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆకాశాన్నంటుతున్న నిత్యవసర ధరలు : సీపీఐ

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నిర్వహించే సీపీఐ దేశవ్యాప్త ఆందోళన గోడ పత్రికలను ఆవిష్కరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రోజు రోజుకు నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతున్నాయి. బియ్యం, పప్పులు, చింతపండు వంటి నిత్యావసర వస్తువులతోపాటు కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయన్నారు. పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఏం కొనేట్టు లేదు. ఏం తినేట్టు లేదు. దీనికితోడు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా పెంచిందన్నారు. పేదల ఆదాయం పెరగకుండా ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజా జీవనం అస్తవ్యస్థంగా మారుతోంది. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను ఇవ్వాల్సిన ప్రభుత్వాలు కేవలం నాసిరకం బియ్యం పంపిణీతో సరిపెట్టేస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ సర్కార్ కేవలం కార్పొరేట్ గుత్త పెట్టుబడిదారుల అడుగులకు మడుగులొత్తుతూ పాలన సాగిస్తోందే తప్ప ప్రజా జీవన ప్రమాణాల మెరుగుదలకు ఏమాత్రం ప్రయత్నించడం లేదు. ఒకవైపు కొత్త రేషన్ కార్డుల మంజూరుకు జనాభా లెక్కలతో ముడిపెడుతూ, మరోపక్క కార్డుదారులు మరోసారి ఆధారాలు చూపి రేషన్ కార్డులు పునరుద్ధరించుకోవాలనే నిబంధనలు పెడుతూ రేషన్ కార్డులు కుదించే యోచనలో ప్రభుత్వాలున్నాయి. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలనే సుప్రీం కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాయి. పేదరిక నిర్మూలనతోపాటు ప్రజలకు పౌష్టిక ఆహారం అందించే బాధ్యత నుండి ప్రభుత్వాలు తప్పుకునేందుకు చూస్తున్నాయన్నారు. తాము కేంద్రంలో అధికారం చేపట్టిన 100 రోజుల్లో ధరల భారాలు తగ్గిస్తామంటూ 2014 ఎన్నికలకు ముందు నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలు 10 ఏళ్ల దాటినప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఆహార భద్రతా చట్టం పకడ్బందీ అమలు, ధరల స్థిరీకరణ నిధి, రైతుల పంటలకు గిట్టుబాటు ధర వంటి హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్య, నాయకులు వై వెంకట శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై మోపిన భారాలను తగ్గించాలి

విశాలాంధ్ర-పొన్నలూరు : భారత కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్త ప్రజా ఆందోళన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పొన్నలూరు మండల కేంద్రంలో సిపిఐ నాయకులు ప్రజలను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె వీరారెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, వీటికి తోడు పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రెండింతలు పెంచిందని ఇవి సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి బతుకు భారంగా మారిందని అన్నారు.ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులను ఇవ్వాల్సిన ప్రభుత్వాలు కేవలం నాసిరకం బియ్యం పంపిణీతో సరిపెట్టుతున్నాయని అన్నారు. అర్హులైన ప్రజలందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని సుప్రీం కోర్టు నిబంధనలు ఉన్న అమలు చేయటం లేదని అన్నారు. దేశంలో కొత్త రేషన్ కార్డులు కోసం 13 కోట్లకు పైగా ప్రజలు దరఖాస్తు చేసుకొని ఉన్నారని అన్నారు. ప్రపంచ ఆహార సూచికలో భారతదేశం 129 వ స్థానంలో ఉండటం సిగ్గుచేటని అన్నారు. మన రాష్ట్రంలో కొత్తగా అర్హులైన సామాజిక పెన్షన్ల కోసం సంవత్సర కాలం పైగా ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు.

అలాగే రాష్ట్రంలో, మన జిల్లాలో పేదల భూములను, ప్రభుత్వ భూములను భూ బకాసురులు బలవంతంగా ఆక్రమించి నకిలీ స్టాంపులతో రిజిస్ట్రేషన్లు చేయించుకొని ఆన్లైన్ చేయించుకున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. అలాంటి వారి నుంచి నిజమైన లబ్దిదారులకు వారికి హక్కులు కల్పించాలని వీరారెడ్డి కోరారు. ఈనెల ఆరవ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి సమస్యలతో కూడినటువంటి అర్జీలను జిల్లా కలెక్టర్ గారికి అందజేయడం జరుగుతుందని బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాని అనంతర కార్యక్రమాల్ని జయప్రదం చేయాలని వీరారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎం శేషారెడ్డి, లాజరు, ఎన్ బాలకోటయ్య, సిహెచ్ అంకయ్య, సిహెచ్ మాలకొండయ్య, హసన్ మొదలగు వారు పాల్గొన్నారు.

వరద ముంపులోనే లంక గ్రామాలు

విశాలాంధ్ర - కొల్లూరు : కృష్ణా నదీ వరదల ప్రభావంతో ముంపు ముప్పులోకి వెళ్లిన తీర ప్రాంత గ్రామాలు నేటికీ కొట్టుమిట్టాడుతున్నాయి. వరద తాకిడి అధికంగా ఉన్న కారణంగా కొల్లూరు మండలపరిధిలోని 22 లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సోమవారం రాత్రి నుంచి వరద ప్రవాహ వేగం తగ్గడంతో గ్రామాలలో ప్రవహించిన వరద నీరు క్రమంగా తగ్గుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో తగ్గకపోవడంతో అధిక శాతం ఇళ్లు వరద నీటిలోనే ఉన్నాయి. ముంపు బాధిత గ్రామాలలో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ఆయా గ్రామాలలోని ప్రజలు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాలలోని ప్రజలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఆహారం, తాగునీరు బాధితులకు సక్రమంగా అందకపోవడంతో మంచినీటి కోసం బాధితులు విలవిలలాడుతున్నారు. గ్రామాలలో ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులో ఉన్నప్పటికీ పడవల ద్వారా వస్తున్న ఆహార పదార్థాలను, మంచినీటి బాటిళ్లను కొద్ది మంది మాత్రమే బలవంతంగా తీసుకొని తమ గృహాలకు తరలించుకొని దాచుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మండల పరిధిలోని లంక గ్రామాలలో సాగులో ఉన్న వాణిజ్య పంటలు వరద నీటితో మునిగి పూర్తిగా పంట నష్టం వాటిల్లుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నదీ పరివాహక గ్రామాలలోని రహదారులపై వరద నీటి ప్రవాహం వైదొలగక పోవడంతో రాకపోకలు జరిగే వీలులేక గ్రామాలు మొత్తం జలదిగ్బంధంలోనే ఉన్నాయి. గ్రామాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లే అవకాశాలు లేకపోవడం, పడవలు అందుబాటులో లేక ప్రజలు నరకాన్ని చవిచూస్తున్నారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముంపు బాధితుల సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థుల కుటుంబాలకు ఏలూరి లక్ష్మి దేవి ట్రస్ట్ ఆర్థికసాయం

విశాలాంధ్ర-పెద్దారవీడు : ఏలూరి లక్ష్మీ దేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న విషయం అందరికి తెలిసిందే. ఇటీవల పెద్దారవీడు మండలంలో కొత్తపల్లి గ్రామంలో నీటి కుంటలో పడి ముగ్గురు విద్యార్థులు దుర్మరణం పాలైన సంఘటన తెలిసిందే. ఈ సమాచారం అందుకున్న ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి మంగళవారం సాయంత్రం కొత్తపల్లి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మృతి చెందిన అరవిటి ఏడు కొండలు,కొత్తపల్లి శివ ప్రసాద్ ఆచారి, కొత్తపల్లి మన్ను ఆచారి ల కుటుంబ సభ్యులకు డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి తమ ట్రస్ట్ ద్వారా ఒక్కొక్కరి రూ 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. డాక్టర్ ఏలూరి మాట్లాడుతూ ఈతకు వెళ్లి చిన్న పిల్లలు మృత్యు వాతకు గురికావడం విషాదకరమని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని వ్యక్తం చేశారు. మండల టిడిపి సీనియర్ నాయకులు గొట్టం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మృతి చెందిన పిల్లల కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహకారాన్ని అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం నియోజక వర్గ బిజెపి ఇన్చార్జి పీవీ కృష్ణారావు,పెద్దారవీడు, పెద్ద దోర్నాల మండలాల బిజెపి అధ్యక్షులు బొచ్చు కోటిరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర - కొల్లూరు : గతంలో ఎన్నడూ ఎరుగని రీతిలో కృష్ణానదికి వరదలు సంభవించడంతో ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాలతో కొల్లూరు మండలంలోని వరద నీట మునిగిన లంక గ్రామాల్లో పోలీసు అధికారులు మూడు రోజులపాటు అక్కడే ఉండి స్థానికులకు సేవలం దించారని అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ అన్నారు. కొల్లూరు పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరదల వల్ల నివాసాలన్నీ వరద నీట మునిగి పోయి విద్యుత్తు సరఫరాలేక పోవడం వల్ల లంక గ్రామాల ప్రజల ఎదుర్కొన్న ఇబ్బందులు గురించి ఆయన వివరించారు.

ఘనంగా పవన్, ఇమ్మడిల జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మార్కాపురం : రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్‌ల పుట్టినరోజు సందర్భంగా జనసేన పార్టీ కార్యాలయంలో వారి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఇమ్మడి కాశీనాథ్ చేత కేక్‌ను కట్‌చేయించి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఇమ్మడి కాశీనాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఇమ్మడి కాశీనాథ్‌ల జన్మదినం ఒకే రోజు రావడం హర్షణీయమని అన్నారు. ఇలాంటి వేడుకల సందర్భంగా ఎంతోమంది క్షతగాత్రులకు అవసరమయ్యే విధంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. జనసేన నేత ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ జనహృదయనేత పవన్ కళ్యాణ్ అడుగు జాడల్లో పయనిస్తూ మానవసేవే మాధవసేవగా పనిచేయాలని అన్నారు. ఇమ్మడి కాశీనాథ్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం, రాష్ట్ర టీడీపీ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎన్వీ రమణ, వార్డ బ్రాంచి మేనేజర్ ఎం అల్లూరిరెడ్డి, మాజీ ఏపీపీ ఉమ్మడి రవీంద్రనాథ్ ఉన్నారు.

వైఎస్ ఆశయ సాధనే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే అన్నా

విశాలాంధ్ర-మార్కాపురం : తుదిశ్వాస వరకు అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం కృషి చేసిన స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ ఆశయాలే లక్ష్యంగా ముందుకెళ్దామని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమం సందర్భంగా సోమవారం పట్టణంలోని డాక్టర్ వైయస్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుతో పాటు పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అన్నా మాట్లాడుతూ ఐదున్నర సంవత్సరాల పాటు ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి పేద ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఐదు సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో వినూత్నమైన కార్యక్రమాలను చేపట్టారని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి బాటలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ముందుకు నడవాలని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ సీహెచ్ బాలమురళీకృష్ణ, వైసీపీ పట్టణాధ్యక్షులు మునిసిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కె ఇస్మాయిల్, మునిసిపల్ కౌన్సిలర్లు డాక్టర్ సీహెచ్ కనకదుర్గ, బుశ్శెట్టి నాగేశ్వరరావు, దారివేముల హర్షిత బాబి, కశ్శెట్టి నగేష్, పార్టీ నాయకులు గుంటక చెన్నారెడ్డి, గుంటక వనజాక్షి, గుంటక వెంకటరెడ్డి, రోజ్‌లిడియో తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
सेन्ट्रल बैंक ऑफ़ इंडिया
1911 से आपके लिए "केंद्रित" "CENTRAL" TO YOU SINCE 1911
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఒంగోలు బ్రాంచి(0840), ట్రంక్ రోడ్డు, నెల్లూరు బస్టాండ్ ఎదురు, ఒంగోలు-523001, ప్రకాశం జిల్లా, ఎ.పి.,
ఫోన్: 08592-233156, మొబైల్: 6304906638

SARFAESI రూల్ [రూల్ 8(1)] క్రింద స్వాధీనతా ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం **సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఒంగోలు బ్రాంచి** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) మరియు 13(12)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ మెస్సర్స్ **వరలక్ష్మి ఇండస్ట్రీస్ తరఫున యజమానురాలు: శ్రీమతి మాటూరి వరలక్ష్మి, భర్త: మాటూరి జగన్‌మోహన్‌రావు,** పెల్లూరు గ్రామము, ఒంగోలు మండలం-523001. **ఋణగ్రహీత: శ్రీమతి మాటూరి వరలక్ష్మి, భర్త: మాటూరి జగన్‌మోహన్‌రావు,** డి.నెం. 37-1-423(A), 1వ లేన్, రామ్‌నగర్, ఒంగోలు-523001. **హామీదారు: 1) శ్రీ మాటూరి చలపతిరావు, తండ్రి: యమ్.శేషయ్య,** డి.నెం. 37-1-423(A), 1వ లేన్, రామ్‌నగర్, ఒంగోలు-523001. **హామీదారు: 2) శ్రీ మాటూరి వెంకటరావు, తండ్రి: యమ్.శేషయ్య,** డి.నెం. 37-1-423(A), 1వ లేన్, రామ్‌నగర్, ఒంగోలు-523001 **వార్లు** మొత్తం బకాయిసొమ్ము **రూ.62,08,315.00/- (అక్షరాల అరవై రెండు లక్షల ఎనిమిది వేల మూడు వందల పదిహేను రూపాయలు మాత్రమే)** (ఇది 07-06-2024 తేదీనాటికి చెల్లించాల్సిన అసలు మరియు వడ్డీని సూచిస్తుంది) ప్లస్ ది.07-06-2024 తేదీనుండి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.07-06-2024న డిమాండ్ నోటీసు** జారీచేయడమైనది.

బకాయిసొమ్ము చెల్లించడంలో ఋణగ్రహీత విఫలమైనందున, సదరు చట్టంలోని సెక్షన్ 13 (4)తో అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి రూలు 8 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ పేర్కొన్న **ఆస్తిని 3 సెప్టెంబర్ 2024న సింబాలిక్ స్వాధీనత తీసుకోవడమైనదని** ఋణగ్రహీతకు, హామీదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది. సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదనీ, ఎటువంటి లావాదేవీలైనా **రూ.62,08,315.00/- (అక్షరాల అరవై రెండు లక్షల ఎనిమిది వేల మూడు వందల పదిహేను రూపాయలు మాత్రమే)** (ఇది 07-06-2024 తేదీనాటికి చెల్లించాల్సిన అసలు మరియు వడ్డీని సూచిస్తుంది) ప్లస్ ది.07-06-2024 తేదీనుండి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు **సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారి ఛార్జీకి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీతను, హామీదారును మరియు సాధారణ ప్రజానీకానిని హెచ్చరించడమైనది.

సదరు చట్టం 13వ విభాగం యొక్క ఉప విభాగం(8) నియమావళి ననుసరించి సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు తగిన సమయం లభిస్తుందని ఋణగ్రహీతలకు విన్నవించటమైనది.

స్థిరాస్తి యొక్క వివరములు

సర్వే నెం. / ఖాతా నెం. / ఇంటి నెం: ఒంగోలు మండలం, పెల్లూరు గ్రామము, సర్వే నెం. 219/2 లోని య॥ 1.70 సెంట్లు విస్తీర్ణముగల ఆస్తి. స్థలము మరియు భవనము.
విస్తీర్ణము / స్థలము యొక్క ఏరియాలు / భవనము: ఒంగోలు మండలం, పెల్లూరు గ్రామము, సర్వే నెం. 219/2 లోని య॥ 1.70 సెంట్లు విస్తీర్ణముగల ఆస్తి. స్థలము మరియు భవనము.
సబ్ జిల్లా లొకేషన్ / జిల్లా హద్దు / గ్రామము / మునిసిపాలిటీ మొ॥ : యమ్ఆర్ఓ, ఒంగోలు.
సరిహద్దులు: తూర్పు: సాయిబాబా ట్రస్ట్ స్థలము; **పడమర:** పెల్లూరు పాండ్; **ఉత్తరం:** పెల్లూరు పాండ్; **దక్షిణం:** పెల్లూరు పాండ్ మరియు కచ్చారోడ్డు.
పైన పేర్కొన్న ఆస్తి శ్రీమతి మాటూరి వరలక్ష్మి పేరునగలదు.

తేది: 03-09-2024, ప్రదేశము: ఒంగోలు సం/- అధీకృత అధికారి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వరద ముంపులో రొయ్యల చెరువులు

– రూ.కోట్లలో నష్టమని రైతుల ఆవేదన

విశాలాంధ్ర – రేపల్లె : గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కృష్ణా నదికి వచ్చిన వరద ప్రభావం కారణంగా నది పరివాహ ప్రాంతానికి అనుకుని రొయ్యల చెరువులు వేసిన రైతులు తమ చెరువులు వరద వర్షపు నీరుతో నిండిపోయి కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రేపల్లె రూరల్ మండలం రాజు కాలువ దగ్గర నుండి వయా పెనుమూడి కాలువ కట్ట మీదుగా విజయవాడ వరకు కృష్ణానది పరివాహక ప్రాంతానికి ఆనుకుని 100 లాది మంది రైతులు ఆక్రమించుకొని ఆక్వా సాగు చేస్తున్నారు. ప్రతి ఏడాది వరదలు,వర్షాలు వచ్చిన సమయంలో ఈ నది ప్రాంతానికి పక్కనే ఆనుకుని ఉన్న రొయ్యలు చెరువులు పూర్తిగా నీట మునిగి అందులో వేసిన రొయ్యల పంట నష్టం వాటిల్లి కోట్లాది రూపాయలు నష్టం జరుగుతున్నదని ఆక్వా సాగు చేస్తున్న రైతులు వాపోతున్నారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చాలామంది రైతులు లేదా మత్స్యకారులు వరి పంట పొలాల పక్కనే అందునా కృష్ణానది దిగువున వారధికి రెండు వైపులా ఉన్న వరి పొలాలు రొయ్యల చెరువులుగా మార్చారు.వర్షపు నీరు వరద నీరు వచ్చిన సమయంలో రొయ్యల చెరువులు పూర్తిగా ముంపుకు గురై చెరువులు రూపురేఖలే కనపడకుండా మారి పోతున్నాయి. వర్షపు నీరు వరద నీరు రొయ్యల చెరువుల్లో చేరి రొయ్యలు చెరువులు సముద్రముల రొయ్యలు చెరువులు కనిపిస్తున్నాయి.

మునిగిపోయిన మోర్తోట ముక్తేశ్వర స్వామి దేవాలయం

విశాలాంధ్ర – రేపల్లె : గత 4 రోజులుగా కురిసిన భారీ వర్షాలు, వరదలు ప్రభావంతో కృష్ణానది పరివాహక ప్రాంతానికి ఆనుకుని దక్షిణ కాశీగా పేరుగాంచిన రేపల్లె మండలం మోర్తోట ముక్తేశ్వర స్వామి దేవాలయం వర్షపు నీరు వరద నీటితో ఆలయం లోపలికి నీరు చేరడంతో గుడి, గర్భగుడి నేటి వరకు నీటిలోనే మునిగి ఉన్నది.ప్రతి సంవత్సరం వర్షాలు వరదలు వచ్చిన సమయంలో కృష్ణానది పరివాహక ప్రాంతానికి ఆనుకుని లోతట్టు ప్రాంతంగా దేవాలయం పరిసరాలు ఉండడంతో వరదనీరు, వర్షపు నీరు ఆలయం లోపలికి ప్రవేశించడంతో దేవాలయ అర్చకులు, భక్తులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి తోడు వరద నీరు కృష్ణ నదికి భారీగా రావడంతో వరదనీరు దేవాలయంలోనికి ప్రవేశించడంతో వరద నీరు గుడిలో చేరి ఉంది.

పునరావాస కేంద్రాల్లో 'రెడ్‌క్రాస్' ఆహార పొట్లాలు పంపిణీ

విశాలాంధ్ర – బాపట్ల టౌన్ : వరద ప్రభావిత పునరావాస కేంద్రాలలో ఉన్న వరద బాధితులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరుపున ఆహార పదార్థాల పంపిణీ చేశామని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బిఎస్ నారాయణ బట్టు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వచ్చిన సమయంలో ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. రేపల్లె మండల పరిధిలోని పెనుమూడి,భట్టిప్రోలు వెల్లటూరు, ప్రాంతాల్లో ఉన్న వరద బాధితులకు పండ్లు బిస్కెట్స్ ఆహార పదార్థాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని గూడ శ్రీనిధి,కార్తికేయ, పానకాల రాయుడు వారి సహకారంతో నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఎంపీడీవో శివ పార్వతి, ఎమ్మార్వో శ్రీనివాస్, జిల్లా రెడ్ క్రాస్ ప్రతినిధులు డి.వి రమణబాబు, మల్లెల వేణు, కర్లపాలెం రెడ్ సొసైటీ చైర్మన్ పోలీసు రావు,అంబటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం భోజనం, తాగునీటిని సమృద్ధిగా అందించాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర – బాపట్ల : లంక గ్రామాలలో చిక్కుకున్న ప్రతి ఒక్కరికి అల్పాహారం,భోజనం, తాగునీటిని అధికారులు సమృద్ధిగా అందించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. కొల్లూరు లాక్‌ల వద్ద నుంచి మర బోట్ల ద్వారా లంక గ్రామాలకు చేరుతున్న అల్పాహారం,భోజన పదార్థాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు.ఉదయం ఎనిమిది గంటలకే లాక్‌ల వద్దకు చేరుకుని నిత్యాసర వస్తువులు పంపిణీపై ఆయన ఆరా తీశారు. ఎవరికి అందలేదని ఫిర్యాదులు రాకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు.జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వరావు లంక గ్రామాలలోనే మూడు రోజుల నుంచి బస చేయడంపై కలెక్టర్ ఫోన్‌లోనే మాట్లాడారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.వరద నీటి ప్రవాహం మూడు అడుగుల దిగువకు తగ్గడంతో పరిశీలించారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న గ్రామాల ప్రజలకు ఆహార పదార్థాలు కొరత లేకుండా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. 23 వేల మందికి సరిపడ అల్పాహారం పంపుతున్నామన్నారు. 23 వేల టెట్రా మిల్క్ ప్యాకెట్లు, మరో 23 వేల కేకులు,23 వేల బిస్కెట్ ప్యాకెట్లు, 23 వేల (టిఫిన్) అల్పాహారాన్ని బోట్ల ద్వారా తరలిస్తున్నామని చెప్పారు.ఒక్కొక్కరికి ఐదు లీటర్ల చొప్పున మినరల్ వాటర్‌ను అందిస్తున్నామన్నారు.ఆహార పదార్థాలు పంపిణీలో ఎవరికి ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.48 మర బోట్లతో ఆహార పదార్థాలు తరలిస్తున్నామని,మరో ఆరు బోట్లు సిద్ధంగా ఉంచామన్నారు. అత్యవసర పరిస్థితుల కొరకు రెండు హెలికాప్టర్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.ఆయన వెంట మత్స్య శాఖ జెడి పి.సురేష్, గృహ నిర్మాణ శాఖ పిడి ప్రసాద్, అనుబంధ శాఖల అధికారులు ఉన్నారు.

నీట మునిగిన మత్స్యకారుల గృహాలు

విశాలాంధ్ర – రేపల్లె : మత్స్యకారుల ఇళ్లల్లోకి చేరిన వరద నీరు దగ్గు ముఖం పట్టకపోవడంతో పెనుమూడి పల్లిపాలెంకు చెందిన సుమారు 250 కుటుంబాల వారు పడవలలో తమ ఇంటి సామాగ్రి వేసుకుని రోడ్డుపైన పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరద ఉధృతికి నీరు ఇళ్లల్లోకి చేరడంతో ఇంట్లోని సామాగ్రి వస్తువులు అన్ని నీటిలో తడిచిపోవడంతో వాటిని పడవలలో సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టడంతో రోడ్డుపైనే సామాన్లు భద్రపరచుకొని వాటి వద్ద జీవనం సాగిస్తున్నారు. కొంతమంది పునరావాస కేంద్రాల్లో తలుదాచుకోగా, చాలా కుటుంబాల వారు రోడ్డుపైనే జీవనం సాగిస్తున్నారు.వర్షం వరద నీరు పూర్తిగా ఇళ్లల్లో నుండి తగ్గిన తర్వాతే తమ తమ ఇళ్లకు వెళ్తామని అప్పటివరకు పునరావాస కేంద్రాల్లో గాని, రోడ్డుపైనే జీవనం సాగించాల్సి వస్తుందని అంటున్నారు.2009వ సంవత్సరంలో వరద వచ్చిన సమయంలో అప్పటి ప్రభుత్వం,పాలకులు పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని వాగ్దానం చేసి తిరిగి మరల ఇప్పుడు వరద వర్షపు నీరు చేరేటప్పటికి పునరావాసు కేంద్రాలకు తరలించి సహాయ చర్యలు చేపట్టడం,వర్షపు నీరు తగ్గిన తర్వాత ఇళ్లకు పంపడం,తర్వాత తమ గురించి పట్టించుకున్న అధికారులు గాని పాలకులు గాని,ప్రజా ప్రతినిధులు గాని కనిపించరని వారు వాపోతున్నారు.వర్షము వరదలు వచ్చి తమ గృహాలు గత మూడు రోజుల నుండి వరద నీటిలో గృహాలు కనిపిస్తున్నాయని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు.కాలనీ పూర్తిగా నీటిలో ఉండకుండా,తాత్కాలిక చర్యలు కాకుండా,శాశ్వతమైన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

శాంతించిన కృష్ణమ్మ

విశాలాంధ్ర – రేపల్లె : గత నాలుగు రోజులుగా రేపల్లె డెల్టా తీరంలోని తీర ప్రాంత వాసులను, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది, కంటిమీద కునుకు లేకుండా రేపల్లె మండలం పెనుమూడి కరకట్ట బాట పడ్డారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా భారీ నుండి అతి భారీ వర్షాలు సంభవించటంతో వాగులు,వంకలు,నదీ పరివాహక ప్రాంతాలలో వరద ఉధృతి పరవళ్ళు తొక్కింది. కృష్ణానది నీ ఆనుకుని ఉన్న కరకట్టలు వరద ఉధృతికి కోతకు గురై బలహీనపడటంతో కరకట్ట ఎప్పుడు తెగుతుందోనని తీర ప్రాంత వాసులు, మంత్రులు, అధికారులు భయాందోళనకు గురవుతూ సంబంధిత అధికారులను కరకట్టల వద్ద కావలసిన సామాగ్రిని దగ్గర పెట్టుకొని బలహీనమైన కట్టలను అలోపేతం చేయటానికి కలెక్టర్ల ఆదేశాలతో అధికారులు, సిబ్బంది సమాయత్తమై సైనికుల వలె విధులు నిర్వహించారు. కృష్ణా నదిలో గత 50 సంవత్సరాలుగా ఇంత వరద ఎప్పుడూ చూడలేదని, గ్రామ పెద్దలు వివరిస్తున్నారు. 11:30 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించటంతో కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న రొయ్యల చెరువులు, మత్స్యకారుల ఇల్లు, పడవల తయారీ షెడ్లు,వివిధ దేవతల, దేవుళ్ళ గుళ్ళు,వరద నీటిలో మునిగిపోయాయి. రేపల్లె నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తన నియోజకవర్గానికి వరద ముప్పు పొంచి ఉన్న కారణంగా మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఆగమేఘాల మీద పెనుమూడి–అవి అనంతవరం వద్ద కరకట్ట తెగే ప్రమాదం పొంచి ఉండటంతో కరకట్టను అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నిద్ర లేకుండా తన అనుచరులతో కరకట్టను పరిశీలించి మరలా ఇసుక గోతాలను, సిమెంట్ కట్టలను, ఇనుప కడ్డీలను, జతచేసి రావి అనంతరం వద్ద అనుమానం ఉన్న కరకట్టకి మరమ్మత్తులు చేయించారు. ఇది మంత్రి అనగాని సత్యప్రసాద్ సేవలకు నిదర్శనమని చెప్పొచ్చు.